# 'మా టెల్గు మమ్మికీ'

మాతృభాష అంటే అమ్మ పలుకంత తీయనిదీ అని... ఎవరి మాతృభాష వాళ్లకి, వాళ్ల వాళ్ల అమ్మంత కమ్మనిది... అది ఎవరూ కాదనలేని సత్యం. తమిళుల భాషాభిమానం గురించి చెప్పనక్కర్లేదు.. కన్నడ కస్తూరి సరేసరి, మలయాళీలు ఎక్కడికెళ్లినా వాళ్ల మూలాలు పదిలం. తెలుగు వెలుగే మసకబారింది. కాన్వెంటు టెంట్లు కుక్కగొడుగుల్లా మొలిచి తెలుగుతోటను ధ్వంసం చేస్తున్నాయి. మొన్న పాత కేసెట్ వింటూంటే కళ్లు చెమ్మగిల్లాయి.

"ఎంత చక్కనిదోయి యీ తెలుగు తోట
ఎంత పరిమళమోయి యీ తోట పూలు"
ఏ నందనము నుండి యీ నారు తెచ్చిరో
ఏ సర్ణధీ జలములీ మడుల కెత్తిరో
యీపూల బాలలకింత తీయందనము
యీ లతల పోకిళ్ల కింత వయ్యారము
ఎంత చక్కనిదోయి యీ తెలుగుతోట"

ఎక్కడ ఆ తోట, ఆ పూలూ, ఆ లతలూ, ఆపరిమళం? సంకరమై అంతా దుర్గంధం దుర్గంధం... ఇళ్లలో తెలుగు తెలుగు కాకుండా పోతోంది (మొన్న ఓ పంతులమ్మ నడిగితే వజ్రసుడి నేర్పించమండీ కృష్ణను క్రిష్ణగానే రాయిస్తామని సెలవిచ్చారు) ఇంటరు డిగ్రీల్లో మార్కుల కోసం సంస్కృతం తీసుకుంటున్నారు పిల్లలు. అట్లా అని సంస్కృతం వస్తుందా వాళ్లకి అంటే వాళ్లు నేర్చుకొచ్చే సంస్కృతం వేరే. ప్రభుత్వం ఓ అవధానిగారికి ప్రధాన పీఠమిచ్చి తెలుగు నుద్ధరించమని కొన్ని లక్షలు ఖర్చుపెట్టారు. పెడుతున్నారు. లక్షలు మాయమవుతున్నాయంతే. మాపు పట్టిన మన భాషను శుద్ధపరిచే చిత్తశుద్ధి ఎవరికీ లేదు. తెలుగు వస్త్రం మాసి చిరుగులు పడి జీర్ణావస్థకు చేరుకుంటోంది. దాన్ని శుభ్రపరిచి చిరుగులు అతికి కుట్టి ఉతికి గుండెల దండేల మీద ఆరేయాలి.

మొన్నీమధ్య నాకు తెల్సిన ఓ అమ్మాయి తన అయిదేళ్ల కూతుర్ని పట్టుకు చావ బాదుతోంటే, వెళ్లి ఆపి 'ఎందుకమ్మా పసిదాన్ని అట్లా చంపుతున్నావూ?' అనడిగా. ఆ అమ్మాయి చెప్పిన సమాధానం విని అవాక్కయిపోయా.

'చూడండంకుల్ అమ్మా అంటోదిదీ. ఆ కాన్వెంట్‌లో ఫైవ్ థౌజండ్ డొనేషన్‌కట్టి చేర్పించింది ఇందుకేనా' అన్నది ఆ అమ్మాయి సమాధానం.

'అమ్మా!' అని అచ్చ తెలుగులో కమ్మగా ఏడవడం ఆ పసిపాప చేసిన నేరం...

* * *

ఓ శనివారం రాత్రి ఓ తెలుగు టీవీ కార్యక్రమం చూడడం తటస్థించింది. ఆ కార్యక్రమాన్ని ప్రముఖ గాయకులు శ్రీ బాలసుబ్రహ్మణ్యంగారు నిర్వహిస్తున్నారు. ఆ కార్యక్రమంలో ఆయన తెలుగు భాషకు పట్టిన దుర్గతిని ఎత్తి చూపుతూ 'దయచేసి పిల్లలకు మంచి తెలుగు నేర్పించండి' అని తల్లిదండ్రులను వేడుకున్నారు. పాడుతున్న పిల్లలకు కూడా వత్తులు పొల్లులూ ఏవి ఎక్కడ ఉండాలో దేన్ని ఎలా ఉచ్చరించాలో ఓపిగ్గా తెలియచేశారు. మరొక్కసారి 'పెద్ద బాలశిక్ష' అవసరాన్ని చూపించారు. ఆ కార్యక్రమంలో ఆయన ప్రతివారం ఓ తెలుగు పద్యాన్ని కమ్మగా పాడి (ఆయన ఉత్తినే చదివినా బావుంటుంది)

ఆ పద్యార్థాన్ని విడమరిచి చెబుతారు బాలుగారూ! నమస్కారం, కృతజ్ఞతలు. ఇది బాలుగారిని అభినందించడం మాత్రమే తెలుగు టీవీని కాదు. తెలుగు టీవీ కార్యక్రమాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. వాటిలో తెలుగు దనం మచ్చుకు కూడా కానరాదు. తెలుగు సంస్కృతి తప్ప అన్ని సంస్కృతులూ అందులో వుంటాయి. ఇక యాంకర్లుగా ఉన్నవాళ్లు అష్టవంకరలు తిరుగుతూ భాషను అష్టకష్టాల పాల్జేస్తూ, వింటున్నది తెలుగేనా అన్న సందేహం కలిగిస్తారు.

* * *

రామారావు హయంలో తెలుగుకు మేలే జరిగింది. అసలు తెలుగు అన్న పదానికి గుర్తింపు తెచ్చారాయన. అప్పట్లో రాష్ట రాజధానిలో బోర్డులన్నీ తెలుగులో కూడా ఉండాలని రూలు పెట్టారు. అప్పుడు పాత బస్తీ వ్యాపారులు పడ్డ కష్టం అంతాయింతా కాదు, అక్కడి ప్రకటన బోర్డుల్లోని తెలుగు వాక్యాలు అప్పట్లో పెద్ద జోకులు. మచ్చుకొకటి... దీన్ని చదవడానికి ప్రయత్నించండి 'ఈచ టమెడ మిద టెపుచెయ భడును' (ఇచ్చట మేడమీద టైపు చేయబడును).

* * *

*చాలాఏళ్ల క్రిందట జరిగిన ఓ తెలుగు మహాసభలకు, చాలామంది పండితులనూ, కవులనూ, కళాకారులనూ, రాజకీయులనూ ఆహ్వానించారు. అందులో ప్రత్యేక ఆహ్వానం పొందిన వ్యక్తి టంగుటూరు సూర్యకుమారి. ఆవిడ సభలో ఓ పాట పాడి సభలను ప్రారంభిస్తారు. అందుకోసం ఆవిడని విదేశాల నించి విమానాల్లో పిలిపించారు. ఆవిడ*

పాడే పాట 'మాతెలుగు తల్లికి  మల్లెపూదండ' ఆవిడ తన సుమధుర స్వరంతో కమ్మటి ఆ పాట పాడుతూ ఉన్నారు. వెనకల మాసిపోయి కొద్దిగా చిరుగులు కూడా పడిపోయిన లాల్చీ పంచెతో ఓ వ్యక్తి గట్టిగా అరుస్తోన్నాడు.

సెక్యూరిటీ వాళ్లతో... 'నన్ను ముందుకెళ్లనివ్వండ్రా, ఆ పాట రాసింది నేనేరా' అని... ఓ గొడవ ఆ తర్వాత ఓ అమాత్యవర్యులు వచ్చి ఆ వ్యక్తిని ముందుకు తీసుకెళ్లారు. ఆ అరిచి గీపెట్టిన వ్యక్తి సాక్షాత్తూ శ్రీ శంకరంబాడి సుందరాచారిగారు...

మా తెలుగు తల్లికీ... సారీ మా టెల్గుతల్లికి జాస్మిన్ దండా... ●